



# కాపలా

ఆర్.వి.చలపతి

అసహనంగా తల విదిలించాడు లక్ష్మీపతి. అప్పటికి ఇరవై నిమిషాలపైనే అయింది. యథాలాపంగా చూసినట్టు ఎదురుగా చూశాడు.

ఊహుఁ... అవే చూపులు !

'వెధవ !' పళ్ళు నూరుకున్నాడు లక్ష్మీపతి. 'దిక్కుమాలిన సంత. ఎక్కడికి వెళ్ళినా ఈ ముష్టివెధవల బాధ తప్పదు.'

ఇరవై నిమిషాల క్రితం లక్ష్మీపతి ఆ పార్కులోకి వచ్చాడు. ఖాళీగా ఉన్న ఆ సిమెంటు బెంచీపైన కూర్చోబోతూండగా కనిపించింది ఆ నల్లని పర్సు నేలమీద. పర్సు బాగా ఉబ్బి ఉంది. అటూ ఇటూ చూశాడు లక్ష్మీపతి తనను ఎవరైనా గమనిస్తున్నారేమో అని. ఎవరూ లేరు గానీ ఆ బెంచీకి ఎదురుగా ఏడెనిమిది గజాల దూరంలో ఒక చెట్టుకింద కూర్చుని ఉన్న ముసలి ముష్టివాడిని చూసి ఉలిక్కిపడ్డాడు. వాడూ ఇటే చూస్తున్నాడు. చప్పున బెంచీమీద కూర్చునేశాడు లక్ష్మీపతి. అప్పటి నుంచి ఈ నిరీక్షణ.

ముష్టివాడు చూపులు మరల్చడమే లేదు. సూటిగా పర్సునే చూస్తున్నాడు. తను ఆవైపు రావడం చూశాడేమో? అందుకే పర్సు తీసుకుంటే వాడు ఎవరికైనా చెబుతాడేమో? లేదంటే వాటా అడుగుతాడేమో? భేష్, ఒక ముష్టివాడు తన పార్టనర్. పరవాలేదు. వాటా అడిగితే ఇచ్చేయవచ్చు. కానీ ఎవరికైనా చెబితే అనవసరంగా అల్లరిపాలవుతాడు తను. ఇంతకూ పర్సులో ఎంత పైకముందో తెలియదు. బాగా లావుగా ఉంది కాబట్టి వంద రూపాయల బొత్తి ఉండవచ్చు. లేదా ఒక రూపాయి నోట్ల బొత్తి అయినా కావచ్చు. పనికిమాలిన కాగితాలన్నీ పర్సులో కుక్కే అలవాటు చాలామందికి ఉంది. అలాంటిది కావచ్చు. ఆ పర్సు స్వంతదారు లాటరీ పిచ్చి ఉన్నవాడైతే రకరకాల లాటరీ టిక్కెట్లుండవచ్చు. పర్సు తీసి చూస్తే గాని తెలియదు. కానీ ఎలా?

అప్పుడు సమయం సాయంత్రం నాలుగు గంటలు. పార్కులోని కింకా ఎవరూ రాలేదు. ఆ ముష్టివాడు తను వచ్చేటప్పటికే అక్కడున్నాడు. అంటే పర్సు పారేసుకున్న వాళ్ళెవరో వాడికి తెలిసి ఉంటుంది. పర్సు స్వంతదారు రాగానే తనను పట్టి ఇస్తాడేమో? లేనిపోని గొడవలు.

లక్ష్మీపతికి ఇల్లు జ్ఞాపకం వచ్చింది. దాంతో ఇల్లాలూ జ్ఞాపకం వచ్చింది. చంటాడిని వారం రోజులుగా ప్రేమిస్తున్న విరేచనాలూ, పొయ్యిలో వెచ్చగా పడుకుని విరహగీతాలు పాడుకుంటున్న పిల్లీ, మంచంమీద ఉబ్బసంతో తరగని కబుర్లు చెప్పుకుంటున్న తల్లీ గుర్తు కొచ్చారు.

నాలుగేళ్ళుగా తనను పీడిస్తున్న నిరుద్యోగ రాక్షసీ, నాలుగు రోజులుగా పని ఇస్తాను, ఇస్తానంటూ తనను వాళ్ళింటి చుట్టూ తిప్పుకుంటున్న షావుకారూ, నాలుగు గంటలుగా కడుపులో పరుగెడుతున్న లేని ఎలుకల అలజడీ...

కళ్ళు తిరిగినట్టు అనిపించింది లక్ష్మీపతికి.

ఎదురుగా చెట్టువైపు దొంగచూపులు చూశాడు. హిప్నాటిజం సాధన చేస్తున్నాడా ఈ ముష్టివాడు? ఎంతసేపటికీ చూపు మరల్చడేం?

గోతి పక్క గుంటనక్కలా ఇలా కూర్చోవడం ఇంకెంతసేపు? పార్కులోకి ఎవరైనా జనం రావడం మొదలెడితే అంతే ! పర్సు స్వంతదారే పర్సును వెతుక్కుంటూ రావచ్చు.

దూరంగా మొక్కలకు పాదులు చేస్తున్న పార్కు వాచ్‌మేన్ కనిపించాడు. అతను ఏ క్షణాన్నయినా ఇటు రావచ్చు. లక్ష్మీపతికి ఉక్రోషం ముంచుకొచ్చింది. లేచి వెళ్ళి ఎదురుగా ముష్టివాడిని చాచి ఒక్క టిచ్చుకుందామన్నంత కోపం.

ఈ రోజు రెండో తారీఖు. పర్సు ఎవరైనా ఉద్యోగస్థుడిదైతే కనీసం పది రూపాయల దొంతరయినా ఉంటుంది. ఏ వ్యాపారస్థుడిదో అయితే వంద రూపాయల నోట్లే ఉండవచ్చు. రెండు వందలో, మూడు వందలో ఉన్నా చాలు తనకు చిన్న చిన్న చిక్కులు తీరిపోతాయి. చంటాడిని డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళవచ్చు. తల్లికి అయిపోయిన మందులు కొనుక్కోవచ్చు. ఇంట్లోకి కావలసిన వెచ్చాలు కొద్ది కొద్దిగానైనా కొనుక్కోవచ్చు. కనీసం రెండు, మూడు రోజుల బాటు నిశ్చింతగా గడపవచ్చు.

కానీ, గడ్డిమేట దగ్గర కుక్కలా ఈ ముష్టివాడు దాపురించాడే ! ఏ క్షణంలో పర్సు పోగొట్టుకున్నవాడు తిరిగి వస్తాడో? ఎప్పుడు పారేసుకున్నదో తెలియదు. ఇంతవరకూ వాచ్‌మేన్ కంట బడలేదంటే ఇప్పుడిప్పుడే పారేసుకుని ఉండాలి. అంటే ఇంకాసేపటికి ఎలాగూ వెతుక్కుంటూ వస్తాడు.

లక్ష్మీపతి స్వతహాగా ఇలా అప్పనంగా వచ్చే సొత్తు నాశించే రకం కాదు. ఎవరిదో పర్సు వాళ్ళు వెతుక్కొని వచ్చేలోగా కొట్టేయ్యా లనుకుంటున్న తనను చూసి తనే జాలిపడ్డాడు. కానీ తను దొంగతనం చేయడంలేదు గదా - అని తనకు తానే నచ్చచెప్పుకున్నాడు.

వాచ్‌మేన్ పార్కు మెయిన్‌గేటును బార్లా తెరుస్తున్నాడు. పార్కులోని రేడియోలోంచి గడబిడగా ఏదో వినిపిస్తోంది. లక్ష్మీపతికి ఒళ్ళంతా చెమట పడుతోంది. ఏమైతే అయింది కానిమ్మని మెల్లిగా వంగి పర్సు చేతిలోకి తీసుకున్నాడు. ముష్టివాడివైపు తల తిప్పలేదు. 'పర్సు తెరిచి చూద్దామా' అని మొదట వచ్చిన ఆలోచనను విరమించుకున్నాడు.

ఎదురుగా ఎవరో నిలబడినట్టయింది.

పర్సు స్వంతదారుడా?

ముష్టివాడా?

వాచ్‌మేనా?

పోలీస్ జవానా?

లక్ష్మీపతికి పెదవులు ఆర్చుకుపోయాయి. ఒళ్ళంతా సన్నగా కంపిస్తోంది. మెల్లిగా తల పైకెత్తాడు.

మధ్య వయస్కు డొకాయన చిరునవ్వుతో నిల్చుని ఉన్నాడు.

"ఆ పర్సు నాదేనండీ. అందులో నా ఫోటో కూడా ఉంటుంది చూడండి. ఇందాక ఇక్కడకు వచ్చి కూర్చున్నప్పుడు పడిపోయింది లాగుంది. మీరు కాబట్టి ఇంకా దాన్ని చేతిలో ఉంచుకొని ఎవరిదై ఉంటుందా అని ఆలోచిస్తున్నారు. అదే ఎదురుగా ఆ ముష్టాడి చేతికి చిక్కి ఉంటే ఈపాటికి ఉడాయించేవాడు కాదుటండీ?" అంటున్నాడు ఆ మధ్యవయస్కుడు.

లక్ష్మీపతి మారుమాట్లాడకుండా పర్సును ఆయన చేతి కిచ్చాడు.

"చాలా థాంక్సండీ" అని వెళ్ళిపోయా డాయన.

లక్ష్మీపతి నీరసంగా బెంచిని ఆనుకొని, కళ్ళు మూసుకుని తల వెనక్కు వాల్చాడు.

"అయ్యో, వెళ్ళిపోయావా, అయ్యా?" ఎవరో ఏడుస్తున్న శబ్దం విని ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు.

ఎదురుగా ముష్టివాడి కూతురు కాబోలు ముష్టివాడి శవాన్ని చూసి ఏడుస్తోంది. ముష్టాడి శవం చెట్టుబోదె నానుకొని కూర్చున్నట్లే ఉంది. నిశ్చలమైన, నిర్జీవమైన ఆ చూపులు ఎదురుగా ఉన్న సిమెంటు బెంచీవైపే కేంద్రీకరించి ఉన్నాయి.

"అదే ఎదురుగా ఆ ముష్టాడి చేతికి చిక్కి ఉంటే ఈపాటికి ఉడాయించేవాడు కాదుటండీ..." పర్సు స్వంతదారు మాటలు లక్ష్మీపతి చెవులలో ప్రతిధ్వనిస్తున్నాయి.

'ఇంతసేపూ ఒక శవం చూపులకు భయపడి తాను వదులుకున్న ఆ పర్సులో ఎంత పైకముంది ఇంతకూ?'

లక్ష్మీపతి జుత్తు పీక్కున్నాడు.

# కవితా మహేంద్రజాలం

డా॥ ప్రసాదరాయ కులపతి

నిడుద పెన్నెరి గుంపు జడగట్ట నగరు ము
  మ్మనుమండు తపము గైకొనిన చోటు
జరఠకచ్ఛపకులేశ్వరు వెన్ను గానరా
  జగతికి మిన్నేరు దిగిన చోటు
పుచ్చ డీకతనంబు పోబెట్టి గిరి కన్య
  పతి గొల్వ నా యానపడిన చోటు
వలరాచ రాచవాడవి .కొక్కు కనువెచ్చ
  కరగిన యలక నికరవు చోటు
తపసియి ల్లాండ్ర చెలువంబు తలచి తలచి
మున్ను ముచ్చిచ్చును విరాళిగొన్న చోటు
కనుపపులు వేల్పు బడవాలు కన్నచోటు
హర్షమున జూచి ప్రవరాఖ్యు డాత్మలోన-

కవిత పితామహుడై అల్లసాని పెద్దన ప్రవరుని హిమాలయాలలో తిప్పుతూ చూపించిన అందమైన దృశ్యా లివన్నీ. భగీరథుడు కఠోరంగా తపస్సు చేసిన చోటు, ఆది కూర్మము వీపు కనబడేలా ఆకాశగంగ భూమి మీదికి దిగిన చోటు, పార్వతి పరమేశ్వరునకు సేవ చేసిన చోటు, మన్మథుడు శివుని కంటి మంటలో తగలబడిన చోటు, అగ్ని దేవుడు సప్తర్షుల భార్యలపైన మోహపడి చోటు, రెల్లు గడ్డి కుమారస్వామిని గన్నచోటు - ఇటువంటి వన్నీ హిమాచలం మీద ప్రసిద్ధమైన, చూడదగిన చోట్లు. ఇవన్నీ ప్రవరుడు ఎంతో కుతూహలంతో చూశాడని పెద్దన గారు వర్ణించారు. చాలా చక్కని పద్య మిది. అన లా పద్యం చదివితే మనం కూడా అక్కడికి వెళ్ళి అవన్నీ చూద్దామని అనిపించేంత అద్భుతమైన రచన అది. కండ్లు మూసుకొని ఆ పద్యం మననం చేసుకొంటుంటే ఆ దృశ్యాలన్నీ కంటికి కట్టినట్లు కనిపిస్తాయి. అల్లసాని వారి కవిత శిల్పం అంతటిది. అంత అపూర్వమైనది, అనితరమైనది.

అయితే ఇది ఒక సాహిత్య మహేంద్ర జాలం మాత్రమే. లేనిది ఉన్నట్లు భాసింప .జేయటం. నిజానికి ఈ కథ జరిగింది స్వాయంభువమ న్వంతరంలో. అప్పటికీ పైన చెప్పిన సంఘటనల్లో ఏ ఒక్కటీ జరగలేదు. దక్ష పుత్రిక సతి ఇంకా శివుని భార్యగానే ఉంది. పార్వతి పుట్టనూ లేదు. మన్మథ దహనం జరగనూ లేదు. ఆదికూర్మమూ లేదు. గంగావతారమూ లేదు. కుమారస్వామి పుట్టుకు వచ్చే స్థితే లేదు. అందుకే సంస్కృత మూలం మార్కండేయ పురాణంలో ఇవేవీ లేవు. లేకపోయినా హిమ శైలం అనగానే తన ఊహలో ఉన్న దృశ్యాలన్నీ ప్రవరునికి అంట గట్టేశాడు కవిత పితామహుడు. కాల చిత్యం పట్టించుకోలేదు. విష్ణుమూర్తి అవతారాలన్నీ రాకపోయినా స్వారోచిమని చేత దశావతారాలు స్తుతులు చేయించాడు. అప్పటికి ఒకటి రెండు అవతారాలు మాత్రమే వచ్చాయి. పెద్దన గారు పెద్దవాడు. తెలియక చేశాడని అనలేము. కవి కుండే స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకొని శిల్ప దృష్టితో చేసిన కమనీయ కల్పన - కవిత సత్యం - సారస్వత మహేంద్రజాలం - అందాము.